క్లుప్తంగా

అంజికి కలాం విశిష్టసేవా పురస్కారం


పురస్కారం అందుకున్న అంజి

రాయదుర్గంటౌన్: శ్రీరామ్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యుడైన అంజికి కలాం ట్రస్టు విశిష్ట సేవా పురస్కారం అందించింది. ఇటీవల తిరుపతి మహతి ఆడిటోరియంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో కలాం ట్రస్టు నిర్వాహకులు అంజికి పురస్కారం అందించి, సత్కరించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణస్వామి


రాకెట్ల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ పీఓ నారాయణస్వామి

ఉరవకొండ: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్, ఉరవకొండ నియోజకవర్గ స్పెషల్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ జి.నారాయణస్వామి సూచించారు. గురువారం మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీని ప్రోగ్రాం ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో మందుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్‌తో పాటు ఇతర వైద్య సిబ్బందితో సమావేశమై, పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి నాగరంగయ్య పాల్గొన్నారు.

30న ఆంజనేయస్వామి, ధ్వజ స్తంభ ప్రతిష్ట


ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవస్థానం

కూడేరు: ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈనెల 30న ఆంజనేయ స్వామి, గణపతి విగ్రహాల, ధ్వజ స్తంభం ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. వేదపండితులు బెల్డోణ రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ప్రతిష్ట పూజలు ప్రారంభమవుతాయన్నారు.

బీటీపీకి కృష్ణా జలాలు తీసుకొస్తాం


బీటీపీలో గంగమ్మ పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని సురేంద్రబాబు

గుమ్మఘట్ట: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు వరప్రదాయిని అయిన భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకొస్తామని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. గురువారం సాగునీటి కాలువలకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో 114 చెరువులకు రెండున్నరేళ్లలో కృష్ణజలాలు తీసుకువచ్చే ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. బీటీపీ పూర్తి స్థాయిలో నిండడంతో గంగమ్మకు జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ నారాయణనాయక్, డీఈఈలు రాయదుర్గం, కళ్యాణదుర్గం బలరాముడు, దామోదర్,ఏఈలు సాయిరాం, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆర్థిక పురోగతి


మాట్లాడుతున్న కర్ణాటక ఆదివాసి సంస్థ వ్యవస్థాపకుడు నవీన్ కుమార్

కుందుర్పి: కేంద్రియ వ్యవసాయం ద్వారానే ర్థిక పురోగతి సాధ్యమని కర్ణాటక ఆదివాసి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నవీన్ కుమార్, కుసుమగిరి రైతు సంఘం కార్పొరేషన్ లిమిటెడ్ సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. గురువారం కుసుమగిరి రైతు సంఘం కార్యాయంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయం, పండ్లతోటల పెంపకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. సంస్థ డైరెక్టర్లు లక్ష్మీ పతి, సుదర్శన్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు , రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సేవలు కీలకం .. సౌకర్యాలు మృగ్యం

- షిఫ్ట్ ఆపరేటర్ల అగచాట్లు వర్ణనాతీతం
- వారి భద్రతపై దృష్టి సారించని ప్రభుత్వం
- ప్రమాదాల నియంత్రణకూ పరికరాల కొరత
- రాత్రివేళల్లో విష పురుగుల సంచారం


75 వీరాపురం వద్ద విద్యుత్ ఉప కేంద్రం

రాయదుర్గం: ఇల్లు, వ్యాపారం, పారిశ్రామికం, ప్రభుత్వం కార్యాలయం, వ్యవసాయం ఇలా దేనికై నా సరే నాణ్యమైన విద్యుత్ సరఫరా కావాలంటే ఉప కేంద్రాలు (సబ్‌స్టేషన్లు) బాగా పనిచేయాలి. వాటిలో విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు యాక్టివ్‌గా, ఆరోగ్యంగా ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వీటి నిర్వహణ గాలికొదిలేసింది. ఉప కేంద్రాల్లో సౌకర్యాలూ కొరవడ్డాయి. ప్రమాదం జరిగినా సరైన పరికరాలు లేక రక్షణ చర్యలకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల కణేకల్లు మండలంలోని సబ్‌స్టేషన్‌లో లింబ్‌పేలి, మంటలు చెలరేగాయి. సిబ్బంది వ్యయప్రయాసలకోర్చి అదుపు చేశారు. గుమ్మఘట్ట, డీహీరేహాళ్, బ్రహ్మసముద్రం తదితర మండలాల్లోని ఉప కేంద్రాల్లోనూ అనేక సమస్యలు ఉన్నాయి. ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఇండస్ట్రీ యజమానుల ఒత్తిళ్లు భరించలేక షిఫ్ట్ ఆపరేటర్లు నానా తంటాలు పడాల్సి వస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన మొత్తం 53 విద్యుత్తు ఉప కేంద్రాల్లో సుమారు 200 మంది దాకా షిఫ్ట్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరి భద్రతను గాలికొదిలారు. ఉప కేంద్రాల్లో మంటలను అదుపుచేసేందుకు సీవో-2 సిలిండర్లు, ఇసుక బకెట్లు, ప్రత్యేక డ్రస్ కోడ్, హెల్మెట్, చేతికి గ్లౌజ్‌లు, టార్చిలైట్లు, గమ్‌బూట్లు సరఫరా కాలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన వాటినే వినియోగించాల్సిన పరిస్థితి. రాత్రి వేళల్లో విషకీటకాల బెడద ఎక్కువైంది. ఉప కేంద్రాల ఆవరణాల్లో అరకొరగా కంకర చిప్స్ మినహా ఖాళీ స్థలాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు తొలగింపు మొక్కుబడిగా మారింది. సంబంధిత కాంట్రాక్టర్లు పట్టించుకోలేదు. పలు చోట్ల దెబ్బతిన్న గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, రక్షిత తాగునీటి సౌకర్యం లేక షిఫ్ట్ ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. ఎర్త్ రాడ్‌ల సామర్థ్యం పెంపునకు చర్యలూ చేపట్టలేదు.

2,62,913 కనెక్షన్లు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని గృహ, వాణిజ్య, ఇండస్ట్రీ, ప్రభుత్వ, అగ్రికల్చర్ ఇలా అన్ని రకాల సర్వీసులు కలిపి 2,62,913 కనెక్షన్లు ఉన్నట్టు విద్యుత్ శాఖ అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీటన్నింటికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది.

రక్షణ సామగ్రికి ప్రతిపాదనలు



33/11 కేవీ ఉప కేంద్రాల్లోని సీవో-2 సిలిండర్లు, ఇసుక బకెట్లతో పాటు ఇతర రక్షణ సామగ్రి, పరికరాలు, షిఫ్ట్ ఆపరేటర్లకు పరికరాలు గతంలో అందించాం. వాటిని వినియోగిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. తాజాగా కొత్త సామగ్రి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కావాల్సి ఉంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు డోకా లేకుండా చూస్తాం. ఉప కేంద్రాల్లోని అసౌకర్యాలు తొలగించేలా కృషి చేయిస్తాం.

– శేషాద్రి శేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం


ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఉరవకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందని జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు తెలిపారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి చందు, నియోజకవర్గ అధ్యక్షుడు హారూన్‌రషీద్ మాట్లాడారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఉద్యమాలు సాగిస్తుందన్నారు. నవంబర్ 27 నుంచి 30 వరకు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున విద్యార్థిని, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖిల భారత పశు గణన


పశుగణన మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న పశు వైద్యశాల సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్త


ఉరవకొండలో పోస్టర్లను విడుదల చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్, సిబ్బంది

బెళుగుప్ప: దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని కళ్యాణదుర్గం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్త పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో వైద్యాధికారి రమేష్‌తో కలసి పశుగణన వివరాల సేకరణ అంశాలపై మండల పశువైద్యశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలాల్లో ప్రతి గ్రామానికి తప్పకుండా వెళ్లి పశుగణన చేపట్టాలన్నారు. అనంతరం వైద్యశాఖ సిబ్బందికి పశుగణన సేకరణ పోస్టర్లు, మెటీరియల్‌ను వైద్యశాల సహాయ సంచాలకుడు పంపిణీ చేశారు.

పశుగణనను విజయవంతం చేయండి

ఉరవకొండ: 21వ అఖిల భారత పశుగణనను గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ పిలుపు నిచ్చారు. గురువారం ఉరవకొండ పశుసంవర్ధక డీడీ కార్యాలయంలో పశుగణన పోస్టర్లను విడుదల చేశారు. డీడీ మాట్లాడుతూ దేశంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే పశుగణన ఎంతో పకడ్బందీగా జరుగుతుందన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు ‘దుర్గం’ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం


విద్యార్థి ఉదయ్ కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు దుర్గం విద్యార్థులు ఎంపికయ్యారు. కళ్యాణదుర్గంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పీడీ శివమ్మ మాట్లాడుతూ 6వ తరగతి చదువుతున్న అఖిల్ కుమార్, 7వ తరగతి చదువుతున్న అమృత ఇటీవల జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా ప్రాంగణంలో జరిగిన హాకీ పోటీల్లో పాల్గొన్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. నవంబర్ 8,9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా పరిషత్ నార్సు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఉదయ్‌కుమార్ అనే విద్యార్థి సైతం రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి దేవి, పీడీ చల్లా కిరణ్ చౌదరి అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయండి


కె.మారెంపల్లిలో అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి


మాట్లాడుతున్న కూడేరు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

కూడేరు: పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురవారం ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తన కార్యాలయంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ, పారిశుధ్యం మెరుగునకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా తొలి రోజే నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి నగదు అందజేయాలని ఆదేశించారు. ఈఓఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

కణేకల్లు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు వ్యాపించవని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు.గురువారం మండలంలోని కె.మారెంపల్లి, కణేకల్లు, మోడల్ స్కూల్‌లో సీజనల్ వ్యాధులపై అధికారులు అవగాహన కల్పించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి పెట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షాపునీరు, మురికినీరు గుంతల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తప్పని పరిస్థితుల్లో మురికినీరు నిల్వ ఉంటే వారానికోసారి వేస్ట్ ఆయిల్ చల్లుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, మల్లిఖార్జున, ఏఎన్‌ఎంలు శాంతకుమారి, లక్ష్మమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు వెన్నల, ఆఫ్రీన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీటీపీ కుడి,ఎడమ కాలువల్లో ముళ్ల కంపలు


పోలేపల్లి వద్ద ముళ్ల కంపచెట్లు పెరిగిన కుడి కాలువ

బ్రహ్మసముద్రం : మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరద నీరు చేరి పూర్తి స్థాయిలో నీటిమట్టం పెరిగింది. కానీ బీటీపీ కుడి,ఎడమ కాలువల్లో ముళ్ల కంపలు పరుచుకున్నాయి. కాలువలో పూడిక తీయలేదు. చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రాజెక్టులో నీరు వృథాకాకుండా చర్యలు తీసుకోవాలని రాయదుర్గం , కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు తూముల ద్వారా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీరు వదిలారు. కాలువల్లో పూడిక తీసి నీరు వదిలి ఉంటే నీరు సజావుగా వెళ్లేదని రైతులు అంటున్నారు.

ఉరగాద్రి బాలోత్సవం పోస్టర్ల విడుదల


బాలోత్సవం పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ

ఉరవకొండ: నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టే ఉరగాద్రి బాలోత్సవం 2024 పోటీల పోస్టర్లను ఎంఈఓ ఈశ్వరప్ప, నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ తాడికొండ గురువారం విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే పోటీల్లో విద్యార్థిని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని వారి ప్రతిభా పాటవాలు ప్రదర్శించాలన్నారు. నిస్వార్థ పౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ 4,5,6 తరగతులు జూనియర్స్‌గా, 7,8,9 తరగతుల వారు సీనియర్స్ విభాగాల్లో పోటీ పడతారన్నారు. విద్యార్థులకు ఈనెల 27 నుంచి సెలవు రోజుల్లో పోటీలు నిర్వహించి, బాలల దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామన్నారు.

రోడ్లపైనే పశువుల తిష్ట


పాత బస్టాండ్ వద్ద రహదారిపై తిష్టవేసిన పశువులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రహదారులు పశువుల పాకలుగా మారుతున్నాయి. రోడ్లపై పశువుల సం చారంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందు లు పడుతున్నారు. ట్రాఫిక్‌కు తోడు అడ్డదిడ్డంగా పశువులు తిరుగుతుండడం, రోడ్లపై తిష్టవేయడంతో ఇబ్బందిగా మారింది. అనంతపురం రహదారి, లక్ష్మీబజార్, పాత బస్టాండ్, పాత టవర్ క్లాక్ సర్కిల్, కూరగాలయ మార్కెట్, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్లపై పశువులు నిష్టవేస్తున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని అడగ్గా శానిటరీ విభాగం, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో యజమానులను గుర్తించి హెచ్చరిస్తామన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ దివాకర్ రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 28న ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి


చెన్నంపల్లిలో గ్రామ సభను నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు: రీసర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు.గురువారం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ గణేష్, సర్పంచ్ కోకా ముత్యాలమ్మ, మండల సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ నాగరాజు శేఖర్, విలేజ్ సర్వేయర్లు అశోక్, సతీష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రపంచ పోలియో దినోత్సవంపై ర్యాలీ


పోలియోపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్:మండలంలోని ఉద్దేహాళ్‌లో ప్రపంచ పోలియో దినోత్సవంపై వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన పోలియో వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సార్..డోర్ నంబర్లు ఏర్పాటు చేయించండి

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద నూతనంగా ఏర్పాటైన సైనికాపురానికి చెందిన మాజీ ఆర్మీ సైనిక సంఘం అధ్యక్షుడు షేకన్న, జనరల్ సెక్రటరీ ఉమామహేశ్వర రావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి ఎంపీడీఓ కుళ్లాయిస్వామిని గురువారం కలిశారు. సైనికాపురంలో 416 మంది మాజీ సైనికులకు ఇంటి పట్టాలివ్వగా, అందులో 100 మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్లకు డోర్ నంబర్లు కేటాయించాలని, వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు.

వన్నూరుస్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామంలోని సర్మాస్ హుస్సేనీ స్వామి (వన్నూరు స్వామి) దర్గాలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి సమాధికి అలంకరణ చేసి ప్రత్యేక ప్రార్థనలు, దీపారాధన, చదివింపులను నిర్వహించారు.

జేఎల్‌ఎం వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

వజ్రకరూరు: మండలంలోని గడేహోతూరు గ్రామ సచివాలయ జేఎల్‌ఎం చందు వైఖరిపై జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు గడేహోతూరు సర్పంచు కె.సురేంద్ర తెలిపారు. గురువారం గడేహోతూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జేఎల్‌ఎం చందు కొన్ని రోజులుగా ప్రజలకు అందు బాటులో ఉండటం లేదని, విధులపై నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామంలోని కురుబకాలనీ, బస్టాండ్ ఏరియా, ఎస్సీకాలనీ, గ్రామ సచివాలయం తదితర ప్రాంతాల్లో వీధిదీపాలు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. త్వరలో జేఎల్‌ఎం వైఖరిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచు తెలిపారు.

ప్రభుత్వ లాంఛనాలతో నరసింహమూర్తి అంత్యక్రియలు


హెడ్‌కానిస్టేబుల్ నరసింహమూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

కంబదూరు: అనారోగ్యంతో మృతి చెందిన పుట్లూరు హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి మృతదేహానికి గురువారం స్వగ్రామమైన కంబదూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నరసింహమూర్తి మృతి పట్ల జిల్లా ఎస్పీ జగదీష్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే నరసింహమూర్తి మృతదేహాన్ని పుట్లూరు ఎస్‌ఐ హేమాద్రి,ఏఎస్‌ఐ రాజశేఖర్,కంబదూరు ఏఎస్‌ఐ ఓబుళపతి,జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించి ఓదార్చారు.

సజావుగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.వినూత్న, అసిస్టెంట్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఐసీడీఎస్ అనంతపురం అర్బన్ సీడీపీఓ లలిత ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో 21 పోస్టులు ఉండగా, 46 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 43 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మెడికల్ సూపరింటెండెంట్‌గా మెర్సీ జ్ఞానసుధ



రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా మెర్సీ జ్ఞానసుధ (జనరల్ సర్జన్)ను నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్వర్తులు జారీ చేశారు. ప్రస్తుతం మెడికల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.మాధవి (గైనకాలజిస్ట్) స్థానంలో జనరల్ సర్జన్‌గా పని చేస్తున్న మెర్సీ జ్ఞానసుధకు బాధ్యతలు అప్పగించారు. ఈమె అధికారికంగా శుక్రవారం నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

నూతన గదిలోకి అంగన్‌వాడీ కేంద్రం మార్పు


ములకలేడులో నూతన అంగన్‌వాడీ భవనం ఏర్పాటు చేసిన సూపర్‌వైజర్ రాధమ్మ

సాక్షి ఎఫెక్ట్..

శెట్టూరు: ములకలేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతన గదిలోకి మార్చారు. గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. మంగళవారం ‘సాక్షి’లో ఆరుబయట అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ’ శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ఐసీడీఎస్ సీడీపీఓ వనజాఅక్కమ్మ, సూపర్‌వైజర్ రాధమ్మ ములకలేడు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. నూతన గదిలోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చినట్లు తెలిపారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లో వందశాతం సురక్షితంగా ఉండేలా కార్యకర్తలు బాధ్యతగా చూసుకోవాలన్నారు. నాణ్యతలేని అద్దె భవనాలలో పిల్లలకు అసౌకర్యం, ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులపై చర్యలు ఉంటాయని సీడీపీఓ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

కూడేరు: స్థానిక సంగమేశ్వర స్కూల్‌లో గురువారం అంతర్జాతీయ ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ వంటకాల రుచులు ఏవిధంగా ఉంటాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రిన్సిపాల్ లోకనాథ్ విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.